క్లుప్తంగా

తైక్వాండో పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని గచ్చిబౌలిలో ఉన్న జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని వీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సి.వాసిరెడ్డి, డాక్టర్ బి.వినీషా రెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక హాస్పిటల్ ప్రాంగణంలో తైక్వాండో పోటీలో పాల్గొనే క్రీడాకారులను అభినందించారు. ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలను అవకాశంగా మలుచుకుని రాణించాలన్నారు. తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోచ్ అజయ్ తేజ పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాగణం కిటకిటలాడింది.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ధర్మసాయి

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ భాస్కర్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాలకు చెందిన జి.ధర్మసాయి 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలలో 584 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం వైఎస్సార్ కడప జిల్లాలోని ఇడుపులపాయలో గల ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు.

టీబీపై అవగాహన



మాట్లాడుతున్న డెమో శ్రీనివాసులు

కల్లూరు: టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం సచివాలయంలో డెమో శ్రీనివాసులు టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, బరువు తగ్గిపోవడం, 60 ఏళ్లు పైబడిన వారు, పొగ తాగువారు, మద్యం సేవించు వారు గళ్ల పరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్త మాధవి, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో ప్రాణాలకు ప్రమాదం

పత్తికొండ: డ్రగ్స్ వినియోగం ప్రాణాలకు ప్రమాదకరమని, అలాంటి మత్తులో పడి నిండు జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సువర్ణలత సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ప్యాషన్ ట్రెండ్‌లో పడి జల్సాల కోసం విలువైన జీవితాలను పాడు చేసుకోవడం సరి కాదన్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐ సాయిప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



నాటుసారా స్థావరంపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: ఆదోని పట్టణ సమీప కొండల్లో సముద్రపుకుంట ప్రాంతంలో నాటుసారా బట్టీపై దాడులు చేసి 450 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో 11 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సారా బట్టీ నిర్వాహకుడు బోయ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



మాట్లాడుతున్న సీఈఓ జీ.నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025పై క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు అవగాహన పెంచుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ జీ.నాసరరెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో జిల్లాలోని ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జీ.భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీ.నాగేశ్వరరావు, కర్నూలు డీఎల్‌డీఓ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాకు ర్యాంకులు ఇవ్వనున్నారన్నారు. గ్రామాల్లో బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా (ఓడీఎఫ్ ప్లస్)మార్చేందుకు నిరంతర కృషి అవసరమన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, స్థిరమైన గ్రామీణ సమాజాన్ని నిర్మించేందుకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టాల్సి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు పంచాయతీలు, స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఫ్రంట్ లైన్ కార్మికులు, పౌరుల సహకారంతో ముందుకు వెళ్లాలన్నారు.

మహిళల భద్రతకు ‘శక్తి’ యాప్

- అత్యవసర సమయంలో శక్తి వాట్సాప్ నంబర్ 7993485111ను వినియోగించుకోవాలి



కళాశాల విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): మహిళల భద్రత కోసం ‘శక్తి’ వాట్సాప్ నంబర్‌ను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు, ప్రజలకు ‘శక్తి’ యాప్, ‘శక్తి వాట్సాప్ నంబర్’ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడంతో శక్తి యాప్ ఆవశ్యకత, యాప్ సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్‌మాల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు రద్దీ ప్రాంతాల్లో శక్తి టీమ్ చే విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా డయల్ 112 లేదా ఎస్ఓఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. మహిళలు, బాలికలు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



స్టాప్ డయేరియాను పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రఘు

కల్లూరు: అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. మంగళవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చిన్నటేకూరు ఎంపీపీ పాఠశాలలో అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిసార వ్యాధి నుంచి పిల్లలను కాపాడుదాం అనే నినాదంతో పోస్టర్లను ఆవిష్కరించారు. వంట గదిలో ఆహార పదార్థాలపైనా, కోసిన పండ్లు, కూరగాయల ముక్కలపై దుమ్ము, ధూళి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యవంతులు మాత్రమే వంట చేయాలన్నారు. మల విసర్జన తరువాత, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, సామాజిక ఆరోగ్య అధికారి హిమబిందు, ఆరోగ్య కార్యకర్త జయకుమారి, ఆశా కార్యకర్తలు వెంకటేశ్వరమ్మ, రజని, సులోచన, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు

ఎమ్మిగనూరుటౌన్: ఆదోని మండలం ధనాపురం గ్రామ సర్పంచ్‌పై కులవివక్ష చూపిన ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మలపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు సుమాల చార్లెస్, పట్టణ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి,టీడీపీ నాయకురాలు గ్రామ సర్పంచ్‌ను వేదికపైకి పిలవకుండా కిందే నిలబెట్టి ఎస్సీ అని పేర్కొంటూ కులవివక్ష చూపడం శోచనీయమన్నారు. తక్షణం వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జేడీఏ వరలక్ష్మీ, ఏడీఏ ఖాద్రి, ఏఓ శివశంకర్

ఎమ్మిగనూరురూరల్: రైతులు పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోటేకల్, దేవబెట్ట గ్రామాల్లో ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ శివశంకర్ ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జేడీఏ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ అరంభమైనందున రైతులు విత్తనాల ఎంపిక, నాణ్యత ప్రమాణాలను తెలుసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, లూజ్ విత్తనాలు కాకుండా షాపుల్లో తీసుకునేటప్పుడు బిల్లు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు అధారంగా విత్తనాలు వేసుకోవాలని, విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని చెప్పారు.

పంటను నాశనం చేసిన పినతండ్రి



పత్తి పంటను దున్నేసిన దృశ్యం

చిప్పగిరి: ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటను దున్ని నాశనం చేశాడు వరసకు పినతండ్రి అయిన ఓ పెద్ద మనిషి. ఈ సంఘటన మండలంలోని నగడోణ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన సునీత సర్వే నంబరు 384లో 4.97 ఎకరాల పొలంలో 15 రోజుల క్రితం పత్తి విత్తనాలు నాటారు. అయితే ఈ నెల 14న ఆమె చిన్నాయన లక్ష్మిరెడ్డి, ఆయన కుమారుడు రఘునాథ్ రెడ్డి ఇద్దరూ కలసి పొలంలోకి అక్రమంగా చొరబడి పంటను దున్ని నాశనం చేశారు. దీంతో పాటు సర్వే రాళ్లను సైతం తొలగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు తెలిపారు.

భగవన్నామ స్మరణతో మోక్షం

నందికొట్కూరు: రామతారక మంత్రం సర్వజీవులకు మోక్షం ప్రసాదిస్తుందని తిరుమల,తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మిడుతూరు మండల కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో నాలుగు రోజుల పాటు జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీమద్రామాయణములోని వివిధ పాత్రలు సమాజానికి ఎలా అన్వయం చేసుకోవాలి, వాటిలోని ఆదర్శాలు, లోక నీతిని దృష్టాంతాలతో వివరించారు. భక్తుడు సురేష్‌బాబు, ధర్మ ప్రచారకులు చెంచు రామ్మోహన్‌రావు, భజనమండలి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, చిట్టిబాబు, భజన నారాయణ పాల్గొన్నారు.

డెంగీ కేసు నమోదు



టైర్లలో నిలిచిన నీటి తొలగిస్తున్న వైద్య సిబ్బంది

నందవరం : మండల పరిధిలోని రాయచోటి గ్రామంలో డెంగీ కేసు నమోదైనట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహులు తెలిపారు. మంగళవారం గ్రామంలో వైద్యాధికారులు, సిబ్బంది మురుగు కాలువలు, నీటి కుంటలు, టూబ్స్, టైర్లల్లో నిలిచిన నీటిని పరిశుభ్రం చేశారు. మురుగు కాలువల్లో ఎబెట్, డెంగీ వ్యాధి సోకిన వారి ఇంటితో పాటు చుట్టు పక్కన్న 50 ఇళ్లల్లో పైరిత్రమ్‌ను పిచికారీ చేయించారు. గ్రామంలోని ఓ మహిళకు జ్వరం రావడంతో కర్నూలు ఆసుపత్రిలో ఈ నెల 21న వైద్య పరీక్షలు నిర్వహించగా మంగళవారం ఫలితాలు రాగా.. డెంగీ వ్యాధి ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రి తెలిపారు. భగవాన్‌నగర్, శివప్పనగర్, చింతలమునినగర్, గణిగుంతల, ఎంఎస్ లక్ష్మినగర్, కొండాలి నాగిరెడ్డినగర్, చెన్నమ్మ సర్కిల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అసిస్టెంట్ హెయిర్ స్టైలిస్టు కోర్సు (బ్యూటీషియన్)లో ఉచిత శిక్షణ కోసం ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) అసిస్టెంట్ డైరెక్టర్ కె.సంతోష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 60 రోజుల పాటు ఇచ్చే శిక్షణలో 70 శాతం హాజరుతో కోర్సును పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం సర్టిఫికెట్‌ను జారీ చేస్తుందన్నారు. మరిన్ని వివరాలకు వై.కాశీ విశ్వనాథం 99492 46094 నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

26 నుంచి ఆషాఢ మాస పూజలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఈనెల 26వ తేదీ నుంచి ఆషాఢ మాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మహాగౌరీ అమ్మవారికి వారాహీ నవరాత్రి (గుప్త నవరాత్రులు) పూజలు జరుగుతాయని వెల్లడించారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 9.30 గంటలకు లలితా సహస్ర నామార్చన, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు వారాహీ సహస్ర నామార్చన, హోమాలు తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. పూజల్లో భక్తులందరూ పాల్గొనవచ్చని తెలిపారు.

‘అల్లూరి సత్యనారాయణ రాజు’ పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ రచించిన ‘అల్లూరి సత్యనారాయణ రాజు’ నవల ఇంగ్లిష్ వెర్షన్ పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. కర్ణాటక రాష్ట్రం గంగావతిలోని లయన్స్ క్లబ్ క్యాంపస్‌లోని ఐఎంఏ హాల్‌లో లయన్స్ క్లబ్ గంగావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎమ్. శివకుమార్, కార్యదర్శి ఎ.జంబన్న, కోశాధికారి జి.శివప్ప, అల్లూరి సత్యనారాయణ కుమారుడు డాక్టర్ సోమరాజు తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పీజీ ఇంజనీరింగ్ సెట్ ఫలితాలు విడుదల

కర్నూలు (సిటీ): ఆంధ్రప్రదేశ్‌లో ఎంటెక్, ఎం ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 8వ తేదీన నిర్వహించిన ఏపీ పీజీ ఇంజనీరింగ్ సెట్ ఫలితాలను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి ఎక్స్‌లో మంగళవారం విడుదల చేశారు. ఇంజినీరింగ్ ఫార్మసీలో 13 సబ్జెక్టుల్లో నిర్వహించిన పరీక్షల్లో కర్నూలు జిల్లా రీజియన్ నుంచి 821 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 705 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 669 మంది ఉత్తీర్ణులయ్యారు. నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం డబ్ల్యూ.కొత్తపల్లి ఎస్సీ కాలనీకి చెందిన అవుకు ఓబులేసు సివిల్ ఇంజినీరింగ్‌లో 6వ ర్యాంకు సాధించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో నంద్యాల జిల్లా కోవెలకుంట్ల దాసరి కాలనీకి చెందిన ఎం.చంద్రకుమార్ ప్రథమ ర్యాంకు సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో నంద్యాల జిల్లా అర్బన్ సంజీవనగర్‌కు చెందిన జె.వెంకటేష్ 6వ ర్యాంకు, కర్నూలు నగరంలోని ధర్మపేటకు చెందిన బోరెల్లి అభిసాత్విక జియో ఇన్ఫర్మాటిక్స్ ఇంజినీరింగ్‌లో 11వ ర్యాంకు సాధించారు. కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ న్యూ పోస్టల్ వీధికి చెందిన అభిషేకం రబ్బోని నిఖిల్ నాథ్ ఇన్‌స్ట్రుమెంట్ ఇంజినీరింగ్‌లో 7వ ర్యాంకుతో సత్తా చాటారు.

ఉచిత స్పర్శ దర్శన క్యూలైన్ల పరిశీలన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థాన ఉచిత క్యూలైన్లను కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. ప్రస్తుత ఉచిత దర్శనం క్యూలైన్ ద్వారానే స్పర్శదర్శనం భక్తులను కూడా అనుమతించాలన్నారు. ఉచిత స్పర్శదర్శనం భక్తులు వేచివుండేందుకు ప్రత్యేకంగా హోల్డింగ్ ఏరియా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీబాలకృష్ణను ఆదేశించారు. టోకెన్లను అందజేసేందుకు రెండు కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఐటీ విభాగాన్ని ఆదేశించారు. టోకెన్లలో భక్తుడి పేరు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్లను నమోదు చేయాలన్నారు. ఉచిత స్పర్శదర్శనం వేళల గురించి భక్తులకు స్పష్టంగా తెలిసే విధంగా మైకు ద్వారా తెలియజేస్తుండాలని సూచించారు. సహాయ కార్యనిర్వహణాధికారులు ఎం.హరిదాసు, మల్లికార్జునరెడ్డి, స్వాములు ఉన్నారు.

ఆర్‌టీఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజు

కర్నూలు సిటీ: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఆర్‌టీఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (పీ.ఎస్.ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉందని, అయితే నిబంధనల పేరుతో పేదింటి బిడ్డలకు ఉచిత విద్యను అందించేందుకు ముందుకు రానీ స్కూళ్లపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కేవలం జీఓలు ఇచ్చి చేతులు దులుపుకుందని.. ఆ జీఓను అమలు చేయాల్సిన విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించేటట్లు వ్యవహరిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌టీఈ చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రులకు ఉచిత విద్య అమలుపై విద్యాశాఖ అవగహన కల్పించాలన్నారు. 12(1)(సీ) కింద మొదటి, రెండో విడతల కింద ఆయా స్కూళ్లకు కేటాయించిన సీట్లను, దరఖాస్తు చేసుకొని అర్హత పొందిన వారిని స్కూళ్ల యాజమాన్యాలు చేర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు శ్రీశైలం తాత ఆరాధనోత్సవాలు



ములుగుందంలో వెలసిన శ్రీశైలం తాత సమాధి

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో వెలసిన అవధూత శ్రీశైలం తాత 14 ఆరాధనోత్సవాలు బుధవారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. ఆలయంలో తాత సమాధికి గంగపూజ, ప్రత్యేక పూజలు, మహా మంగళ హారతి, సాయంత్రం తాత విగ్రహం ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

రాష్ట్ర స్థాయి భజన పోటీలు..

గ్రామంలో జరిగే ఆరాధనోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి రాష్ట్ర స్థాయి భజన పోటీలు ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్దలు కృష్ణమూర్తి, మనోహర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, చిన్నయ్యప్ప, రంగస్వామి తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు రూ. 300 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరును నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి 4 గ్రాముల బంగారం, ఆ తరువాత వరుసగా 24తులాలు వెండి, 18తులాలు వెండి, 10 తులాలు, 9 తులాలు, 8తులాలు, ఆరున్నర తులాలు, 6 తులాలు, ఐదున్నర తులాలు, 5తులాలు, నాలుగున్నర తులాలు, నాలుగు తులాలు, 3తులాలు, రెండు తులాల వెండి, గోడ గడియారం అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్ 9505286102, 6304167849, 9618623263 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న సహకార సంఘం జిల్లా సీఈఓ రామాంజినేయులు

గోనెగండ్ల: సహకార సంఘాలు మరింత బలోపేతానికి రైతులు సహకరించాలని సహకార సంఘం జిల్లా సీఈఓ రామాంజినేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్ల సహకార సంఘం ఆవరణలో కోఆపరేటివ్ లిటరసీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం సహకార సంఘాలు కంప్యూటరీకరణ చెందాయని, ఇక నుంచి సహకార సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు అందించడం జరుగుతుందన్నారు. రుణాల మంజూరు, చెల్లింపులు అంతా ఆన్‌లైన్ లో ఉంటుందని చెప్పారు. అలాగే సహకార సంఘాల్లో ప్రధాన మంత్రి సురక్ష బీమా, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫసల్ బీమా యోజనకు జూలై 15లోపు ప్రిమియం కట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అబ్కామ్ డీపీడీఎం వహీదా సుల్తానా, డీసీఓ వెంకటకృష్ణ, గోనెగండ్ల సహకారం సంఘం మేనేజర్ అయ్యస్వామి, సీఈఓ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు కార్డుతో ప్రభుత్వ పథకాలు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు

కల్లూరు: పొలాలను కౌలుకు తీసుకున్న రైతులు కౌలు కార్డు పొందడం వల్ల ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దపాడు, సల్కాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాలు, మినీ కిట్స్ రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం సెరికల్చర్ అధికారి సావిత్రితో కలసి ముందస్తుగా విత్తుకున్న పత్తి పంటను పరిశీలించారు. పంటలో సస్య రక్షణ పద్ధతులను తెలియజేశారు. పత్తి పంటలో పచ్చ, రసం పీల్చు పురుగు నివారణకు వేప నూనె లేదా ఇమిడాక్లోప్రిడ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ హుస్సేన్ వీఏఏ, రైతులు పాల్గొన్నారు.


కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోండి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాధాకృష్ణ

ఓర్వకల్లు : మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బ్రహ్మకుమారుడు రాధాకృష్ణ కోరారు. ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం లొద్దిపల్లె శాఖ ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని రాధాకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మాతేశ్వరి జగదాంబ సరస్వతి పుణ్య స్మృతి దినోత్సవం సందర్భంగా మహిళల సౌలభ్యం కోసం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు శిక్షణ పొంది, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగేంద్రారెడ్డి, వెంకటరామిరెడ్డి, రాజమ్మ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలకు లయన్స్ క్లబ్ కీలకం



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ డాక్టర్ బి.జి.రాహుల్

కర్నూలు (టౌన్): సమాజంలో నాయకత్వ లక్షణాలకు లయన్స్ క్లబ్ ఎంతో ఉపయోగపడుతుందని క్లబ్ రీజనల్ చైర్మన్ డాక్టర్ బి.జి.రాహుల్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి స్థానిక డాక్టర్స్ కాలనీలోని ఐఎంఏ భవనంలో లయన్ ఇంటర్నేషనల్ కాకతీయ రీజియన్ జోన్ సోషల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ దినదినాభివృద్ధి చెందేందుకు కొత్తవారిని చేర్చుకుంటూ సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు సభ్యులు పాటు పడాలన్నారు. లయన్స్ క్లబ్ మెంబర్లు ప్రసాద్, బాలమద్దయ్య, నాగేశ్వరరావు, రత్నం, ప్రసాద్, కేవీ సుబ్బారెడ్డి, రాయపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

29న పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన ‘భవ్య భావాలగని – మా భవానీ లీలావతమ్మ’ (స్మృతి సంచిక) పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నరసం కార్యదర్శి డండెబోయిన పార్వతీదేవి తెలిపారు. ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సిల్వర్ జూబ్లీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ రమణ ఐరోపా యాత్ర విశేషాలు అనే అంశంపై ప్రసంగిస్తారని వెల్లడించారు. నరసం అధ్యక్షురాలు కా.వెం.సుబ్బలక్ష్మమ్మ, గాడిచెర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు కురాడి చంద్రశేఖర కల్కూర, రవీంద్రా విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్ ఆర్కే శర్మ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.